క్లుప్తంగా

సీఐగా విశ్వేశ్వర్ బాధ్యతల స్వీకరణ



గీసుకొండ : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐగా డి.విశ్వేశ్వర్ మంగళ వారం రాత్రి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన మహేందర్‌ను అధికారులు హనుమకొండలోని పోలీస్ కంట్రోల్ రూమ్ (పీసీఆర్)కు బదిలీ చేయగా ఆ స్థానంలో పని చేసిన విశేశ్వర్‌ను ఇక్కడకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. కాగా సీఐ విశ్వేశ్వర్ 2012 జూలై నుంచి 2013 ఆగస్టు వరకు మండలంలో ఎస్సైగా విధులు నిర్వర్తించి తనదైన శైలిలో పని చేయగా ఆయన్ను మండల ప్రజలు గబ్బర్‌సింగ్ అని పిలిచేవారు. విధుల్లో చేరిన సందర్భంగా సీఐ విశేశ్వర్‌ను ఎస్సైలు కుమార్, అనిల్, రోహిత్, విజయ రాజ్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



దుగ్గొండి : మండలంలోని మదిరకు చెందిన మందపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) డైరెక్టర్ బూర్గుల రాజు మంగళవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయనకు నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దంజ్యా నాయక్, నాయకులు భరత్‌రెడ్డి, ఆవుల నర్సింహారెడ్డి, కోరె స్వామి, మాజీ సర్పంచ్‌లు బుర్రి సునీత, కూనమల్ల శ్రీనివాస్, పరుపాటి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

నెక్కొండ : తాటి చెట్టు మీద నుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన ఘటన మండలంలోని దీక్షకుంటలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు గాడిపెల్లి భాస్కర్ ఉదయం రోజు మాదిరిగానే తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారింది. దీంతో భాస్కర్ కింద పడిపోయాడు. ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో తోటి గీత కార్మికులు చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని కోదూరుకు చెందిన పులి అంజయ్య కాలికి గాయమై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన్ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంగళవారం పరామర్శించారు. కాలికి గాయమైన విషయమై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, మాజీ సర్పంచ్ కర్ర రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జక్కుల వెంకట్‌రెడ్డి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉపేందర్, నాయకులు కొమ్ము రాజు, వంగాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్లెక్సీల తొలగింపు



దామెర: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. కాగా కోడ్ అమలులోకి రావడంతో అధికారుల ఆదేశాల మేరకు వివిధ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆయా గ్రామ పంచాయతీల సిబ్బంది మంగళవారం తొలగించారు. దీంతో బతుకమ్మ, దసరా సంబురాల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపుతూ వివిధ పార్టీలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు తొలగిపోవడంతో గ్రామాల్లో సందడి లేకుండా పోయింది.

'ముస్లింలకు వాటా కేటాయించాలి'

దామెర : స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లింలకు వాటా కేటాయించాలని మాజీ వైస్ ఎంపీపీ జాకిర్ అలీ కోరారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బీసీకు 42 శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ జీఓ జారీ చేసిందని అన్నారు. కాగా అందులో ముస్లింలు 12 శాతం ఉన్నారని పేర్కొన్నారు. దామాషా ప్రకారం నిబద్ధత కలిగిన ముస్లింలకు ఆయా పార్టీలు బీసీ స్థానాల్లో అవకాశం కల్పించాలని వెల్లడించారు. అవకాశం ఉన్న చోట సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల్లో ముస్లింలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అజ్మత్, సర్వర్, అన్వర్, మస్తాన్, అఖిల్, ఖైరత్, అజ్జు, హన్ను, రహీం తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కంచె కరువు

- ట్రాన్స్‌ఫార్మర్లతో పొంచి ఉన్న ప్రమాదం

నెక్కొండ : మండలంలో పలు గ్రామాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రోడ్లు, పాఠశాలలు, జనావాసాలు, కూడళ్లలోని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు, సిబ్బంది విద్యుత్ బిల్లుల వసూలులో చూపుతున్న శ్రద్ధ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె ఏర్పాటు చేయడంలో చూపడం లేదని మండల ప్రజలు మండిపడుతున్నారు.

ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్లు

మండలంలోని రెడ్లవాడలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రహరీకి ఆనుకుని ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా ఉంది. అలాగే రైతువేదిక సమీపంలోని పంట చేనులో సుమారు 60 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పెద్ద డీపీకు సైతం రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో రైతులు, కూలీలు, పశువులకు ప్రమాదం పొంచి ఉంది. గుండ్రపల్లిలో 11 కేవీ విద్యుత్ తీగ ఇన్సులేటర్ ఇటీవల ప్రమాదవశాత్తు తెగి గొర్రెల షెడ్‌పై విద్యుత్ తీగ పడడంతో విద్యుదాఘాతం చోటు చేసుకుని 18 జీవాలు మత్యువాత పడగా మరో 20 తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. జనావాసాల్లో మరో చోట చోట్ల చెట్ల పొదల మధ్య కంచె లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. చంద్రుగొండలోని ప్రధాన రోడ్డు (బతుకమ్మ చెరువు) వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయలేదు. మండల కేంద్రంలోని వరంగల్ రోడ్డులోని రెండు వెంచర్లల్లో ట్రాన్సఫార్మర్లు ఏర్పాటు చేసి కంచె వేయడాన్ని విస్మరించారు. చెరువు వద్దకు వెళ్లే దారిలోనూ రోడ్డు ప్రక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా పరిణమించాయి. మండలవ్యాప్తంగా సుమారు 60–70 ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం వాటిల్లుతుందోనని ప్రజలు, రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



రెడ్లవాడలోని జనావాసాల్లో కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



చంద్రుగొండలో ..



నెక్కొండలో..



రెడ్లవాడ పంట చేనులో..

ప్రమాదాలు నివారించాలి

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు మరింత ఎక్కువ. ఇకనైనా ట్రాన్స్‌కో అధికారులు తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లన్నిటీ కంచె ఏర్పాటు చేసి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించి ప్రమాదాలను నివారించాలి.

\- రాగూర్ కిషన్, గ్రామస్తుడు, రెడ్లవాడ

ప్రభుత్వానికి నివేదిక అందజేశాం

మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ పలు ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ విషయమై గతంలో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి అందజేశాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేపడతాం. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా అవసరమైన చర్యలు చేపడతాం.

\- చిరంజీవి, ఏఈ

నర్సంపేట రూరల్ : గురిజాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఘనంగా సద్దుల బతుకమ్మ



నల్లబెల్లి : బతుకమ్మలతో వెళ్తున్న మహిళలు



దుగ్గొండి : మండల కేంద్రంలో..

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి, సంగెం మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం మహిళలు సద్దుల బతుకమ్మ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఇళ్లల్లో బతుకమ్మ పండుగ సందడి నెలకొంది. ఆయా గ్రామాల్లోని ఏర్పాటు చేసిన ఆట ప్రదేశాలకు మహిళలు బతుకమ్మలతో వేలాదిగా చేరుకుని ఆడిపాడారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పలు చోట్ల ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.



సంగెం : ప్రథమ బహుమతి పొందిన బతుకమ్మ



సంగెం : మండలం పల్లారుగూడలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



ఖానాపురం : దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని చెన్నారావుపేట, ఖానాపురం, దుగ్గొండి, రాయపర్తి, గీసుకొండ మండలాల్లో మంగళవారం శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తులు, రాజకీయ పార్టీల నాయకులు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయపర్తి మండలంలోని కొండూరులో ఏర్పాటు చేసిన ఉత్సవాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై పూజల్లో పాలుపంచుకున్నారు. పలు చోట్ల నిర్వాహకులు అన్నదానం చేశారు.



రాయపర్తి : భోజనం వడ్డిస్తున్న ఎర్రబెల్లి, భక్తులు



దుగ్గొండి : నాచినపల్లిలో పూజ చేస్తున్న భక్తులు



గీసుకొండ : మచ్చాపూర్‌లో..

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



రాయపర్తి : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు. మండలంలోని తిర్మలాయపల్లి నుంచి రాయపర్తికి వెళ్లే దారిలో ఏపుగా పెరిగిన ముళ్లచెట్లను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురాగా స్పందించారు. జేసీబీ సాయంతో ముళ్లచెట్లను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. పోలీసులు చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముద్రబోయిన వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షుడు వశపాక ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ మెడలిస్ట్‌కు సన్మానం



మామునూరు : వరంగల్ తిమ్మాపురం శివారు రాంగోపాలపూర్‌కు చెందిన యాదల జగపతి బాబు కుమార్తె రమ్యశ్రీ ఎల్ఎల్‌బీ, ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (కేయూ)లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ మేరకు ఆమెను వరంగల్ గవిచర్ల రోడ్డులో గణేశ్ నగర్ ప్రతినిధులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో నెల్లూరు శ్రీనివాసరావు, శాగంటి స్వామి, దామెర రాజశేఖర్, గంద్రాతి రవి, గై కిరణ్‌కుమార్, రాకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని గాయాలు

ఖిలా వరంగల్ : వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై విధి నిర్వహణలో ఉన్న బల్దియా కార్మికురాలికి బైక్ ఢీ కొట్టడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం ఉదయం కరీమాబాద్ ఉర్సుగుట్ట వద్ద జాతీయ రహదారిపై జరిగింది. క్షతగాత్రురాలిని తోటి సిబ్బంది ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

సమాజ సేవకు ఆర్ఎస్ఎస్ ప్రాధాన్యం

- బౌద్ధిక్ ప్రముఖ్ బాషబోయిన వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

ఖానాపురం : సమాజ సేవకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రాధాన్యత ఇస్తుందని బౌద్ధిక్ ప్రముఖ్ బాషబోయిన వెంకటేశ్ తెలిపారు. సంఘ్ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని మనుబోతులగడ్డలో మంగళవారం శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజ సేవలో ప్రతిఒక్కరూ ముందుండాలని కోరారు. విపత్తులు చోటు చేసుకుంటే స్వయం సేవకులు ప్రజాసేవలో క్రియాశీలకంగా భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సంఘ్ బాధ్యులు కుసుమ శ్రీనివాస్, ఆబోతు రాజు, పురుషోత్తం, తేజావత్ శ్రీకాంత్, రాజేందర్, మహేందర్, జయంత్, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి



గీసుకొండ : సీఐ మహేందర్‌ను సన్మానిస్తున్న ఏసీపీ వెంకటేశ్, తదితరులు

- మామునూరు ఏసీపీ వెంకటేశ్

గీసుకొండ : దసరా పండుగ నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణకు రాజకీయ పార్టీల నాయకులు, గ్రామాల పెద్దలు సహకరించాలని మామునూరు ఏసీపీ వెంకటేశ్ కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని పలు గ్రామాల పెద్దలు, రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సమయంలో సోదరభావంతో మెలగాలని సూచించారు. గొడవలకు పాల్పడవద్దని స్పష్టం చేశారు. అనంతరం రెండ్రోజుల క్రితం బదిలీ అయిన సీఐ మహేందర్‌ను ఏసీపీ వెంకటేశ్, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎస్సైలు అనిల్, కుమార్, రోహిత్, విజయరాజ్, ఏఎస్ఐ సుదర్శన్, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు నమిండ్ల చిన్నస్వామి తదితరులు సన్మానించారు. తొలుత సీఐ మహేందర్ అందించిన సేవలను ఏసీపీ వెంకటేశ్ అభినందించారు.

విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఖానాపురం : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై చాగర్ల రఘుపతి చెప్పారు. ఆయన మీడియాతో మాట్లాడారు. దసరా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలను కోరారు. దసరా ఉత్సవాల వద్ద అల్లర్లు, గొడవలకు పాల్పడితే ఊరుకునే ప్రసక్తే లేదని తేటతెల్లం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడితే కేసులు తప్పవన్నారు.

ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడిగా మహేశ్‌బాబు

రామన్నపేట : నగరంలోని రామన్నపేటలోని ఆర్య వైశ్య సత్రం అధ్యక్షుడిగా మళ్లీ గట్టు మహేశ్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఆధ్యాత్మికవేత్త తాటిపల్లి రాజేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా గంప అమర్‌నాథ్, కోశాధికారిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్, సంయుక్త కార్యదర్శిగా రామయ్య, సభ్యులుగా యాదగిరి, సోమలింగం, చక్రపాణి, రాజేశ్వర్‌రావు, మోహన్‌రావు, సోమేశ్వర్, డాక్టర్ మురళీ కృష్ణ, నర్సింహారావు, నమశ్శివాయ, వైకుంఠం, సతీష్ ఎన్నికైనట్లు రాజేశ్వర్‌రావు వెల్లడించారు.

రావణ వధకు ఏర్పాట్లు పూర్తి

ఖిలా వరంగల్ : వరంగల్ రంగశాయిపేటలోని మహంకాళి దేవాలయ ప్రాంగణంలో గురువారం సాయంత్రం నిర్వహించనున్న రావణ వధకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గుండు పూర్ణచందర్ తెలిపారు. వరంగల్ రంగశాయిపేటలోని మహంకాళి గుడి ఆవరణలో ఉత్సవ కమిటీ ఆహ్వాన ప్రతికను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 36 ఫీట్ల రావణ ప్రతిమ, మిరుమిట్లు గొలిపే బాణసంచాతో పాటు సాంస్కృతిక, ఆర్కెస్ట్రా ప్రోగ్రాంలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రావణ వధకు మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ సారయ్య, సికింద్రాబాద్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డాక్టర్ కంచ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి దామెరకొండ కరుణాకర్, ముత్తినేని రామమూర్తి, కొక్కొండ భాస్కర్, పరికిపండ్ల రాజేశ్వర్‌రావు, రామకృష్ణ ప్రసాద్, మండల లక్ష్మయ్య, మనోహర్, పస్తం భిక్షపతి, శంకేశి వెంకటేశ్వర్లు, రమేష్, వీరేశం, కిరణ్, రాజేందర్, కుమార్, అశోక్, వీరస్వామి, ప్రదీప్, మల్యాద్రి, రవీందర్, రమేష్, చక్రపాణి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మద్యం, మాంసంపై మీమాంస

- ఒకే రోజు గాంధీ జయంతి, దసరా
- పండుగ రోజు దుకాణాల బంద్

గూడూరు : హిందూ సంప్రదాయంలో పండుగలకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. అందులో దసరా పర్వదినం అంటేనే అందరూ ఎంతో సంబురపడిపోతారు. దసరా రోజు ప్రతీ ఇంట్లో పిండి వంటకాలతోపాటు మాంసం, మద్యం వంటివి స్వీకరించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఏడాది దసరా పండుగ అక్టోబర్ 2వ తేదీన (రేపు గురువారం) వస్తున్న విషయం తెలిసిందే. అదే రోజు గాంధీ జయంతి కావడంతో ఆ రోజు జీవ హింస చేయరాదు అనే సిద్ధాంతంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మద్యం, మాంసం దుకాణాలను నిషేధించిన క్రమంలో ప్రజల్లో సందిగ్ధత నెలకొంది. దసరా పండుగ ఈసారి గాంధీ జయంతి రోజున వచ్చింది. అదే రోజు మద్యం, మాంసంపై నిషేధంతో పండుగ నిర్వహణ ఎలా..! అన్న చర్చ ప్రజల్లో జోరుగా సాగుతుంది. ఈ నేపథ్యంలో మద్యం, మాంసం విక్రయాలపై సందిగ్ధత నెలకొంటుంది. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 59 వైన్స్‌లతో పాటు పదుల సంఖ్యలో బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. జిల్లా మొత్తంలో సుమారు 300 పైగా మాంసం విక్రయ దుకాణాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో దసరా పర్వదినం గాంధీ జయంతి రోజున రావడంతో మద్యం, మాంసం దుకాణాలు నేటి సాయంత్రం నుంచే మూతపడనున్నాయి.

డిగ్రీలో సబ్జెక్ట్ తప్పిందని..

- మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి మృతి

ఖిలా వరంగల్ : డిగ్రీలో ఒక సబ్జెక్ట్ తప్పిందని మనోవేదనకు గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేటకు చెందిన రాయబారపు శ్రీనివాస్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు వరంగల్ శివనగర్‌లో ఉంటున్నాడు. చిన్నకుమారుడు అరుణ్‌కుమార్ డిగ్రీ ఉత్తీర్ణత కాకపోవడంతో కంప్యూటర్ నేర్చుకునేందుకు వరంగల్‌కు వచ్చి తన సోదరుడి ఇంట్లో ఉంటున్నాడు. గత నెల 26న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్ తెలిపారు.